తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 27- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 53 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in





## హెచ్ఆర్సీ అధికారాలపై స్పష్టత

- ప్రైవేట్ సంస్థలపై విచారణాధికారం లేదన్న హైకోర్టు
- ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహారాలకే హెచ్ఆర్సీ పరిమితమని వ్యాఖ్య
- పని ప్రదేశ వేధింపులకు ప్రత్యేక చట్టాలే సరైన మార్గమని సూచన
- కంపెనీ పిటిషన్‌కు అనుకూలంగా తీర్పు

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్ఆర్సీ అధికార పరిధి ప్రభుత్వ ఉద్యోగులు, వారి విధుల్లో నిర్లక్ష్యం లేదా ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన అంశాల వరకే పరిమితమని స్పష్టం చేసింది. ఈ మేరకు హెచ్ఆర్సీ జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్ఆర్సీని ఆశ్రయించారు.

మిగతా 2లో

జై జవాన్, జై కిసాన్, జై యువ'..

# పోటీ వయస్సు 21 ఏళ్లకు తగ్గించాలి



- 'జై యువ' నినాదంతో ముందుకు సాగాలి
- యువశక్తి ముందు తలవంచిన కేంద్రం
- పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం
- నీట్ లీకేజీ బాధితులకు పరిహారం.. మోదీ క్షమాపణ చెప్పాలి
- చట్టసభల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై జేపీసీ వేయాలి

*దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, రాజకీయ వ్యవస్థలో యువశక్తికి తగిన భాగస్వామ్యం కల్పిస్తేనే భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇకపై 'జై జవాన్.. జై కిసాన్'తో పాటు 'జై యువ' అనే నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించేలా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని స్పష్టం చేశారు.*

2లో

# ప్రజా భవన్‌లో బోనాలు

నల్లపోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాల సమర్పణ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు

మంత్రులు, ప్రజాప్రతినిధుల పాల్గొనిక

రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు

2లో





## బాలభరోసాతో భరోసా

- సాధన సంస్థను సందర్శించిన దామోదర రాజనర్సింహ
- మేధో వైకల్యం ఉన్న చిన్నారులతో మమేకం
- సమగ్ర వైద్య సేవలపై ప్రభుత్వ నిబద్ధత
- సంస్థకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ

2లో

## నిలకడగా పెద్ది ఆరోగ్యంపై..!

- తీవ్ర గుండెపోటుతో అస్వస్థత..
- సీపీఆర్‌తో గుండె స్పందన పునరుద్ధరణ..
- వెంటిలేటర్‌పై హైదరాబాద్‌కు తరలింపు
- హన్మకొండ టూ సికింద్రాబాద్ గ్రీన్ ఛానల్ ఏర్పాటు
- యశోదలో చికిత్స పొందుతున్న పెద్ది



8లో

# మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం



- మల్కాజిగిరిలో కార్యక్రమం వీక్షించిన పార్టీ నేతలు
- దేశ విజయాలను ప్రస్తావించిన ప్రధానమంత్రి
- జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై పిలుపు
- దేశీయ చేనేతకు అండగా నిలవాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 136వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్‌తో పాటు భారతీయ జనతా పార్టీ మాజీ సైనికుల విభాగం సభ్యులతో కలిసి వీక్షించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తెలిపారు. దేశ ప్రజలకు దిశానిర్దేశం చేసే వేదికగా మన్ కీ బాత్ కార్యక్రమం నిలుస్తోందని, సమాజంలో సానుకూల మార్పులకు ఇది ప్రేరణగా ఉంటోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి రక్షణ, అంతరిక్షం, క్రీడలు, విద్య తదితర రంగాల్లో భారత్ ఇటీవల సాధించిన విశిష్ట విజయాలను ప్రస్తావించారని రామచందర్ రావు తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశం మరింత బలంగా నిలుస్తోందని, శాస్త్ర సాంకేతిక రంగం నుంచి క్రీడల వరకు ప్రతి విభాగంలో దేశ యువత ప్రతిభ కనబరుస్తున్న విషయాన్ని ప్రధానమంత్రి ఉదాహరణలతో వివరించారని చెప్పారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## జై జవాన్, జై కిసాన్, జై యువ..

# పోటీ వయస్సు 21 ఏళ్లకు తగ్గించాలి



హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

'జై జవాన్.. జై కిసాన్'తోపాటు ఇకపై 'జై యువ' నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువశక్తిని రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. యువతతో పోరాడాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.. గెలుపు ఎవరిదో కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలో యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ తలవంచిందన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలపై దేశవ్యాప్తంగా యువత పోరాటం చేయడంతోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.

"వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి దేశ రైతాంగాన్ని కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పట్లోనే లోక్‌సభలో రాహుల్ గాంధీ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ.. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మాటలను కేంద్రం పట్టించుకోకపోవడంతో.. రైతులు వీధుల్లోకి వచ్చి నెలల తరబడి పోరాడారు. చివరకు కేంద్రం ఆ చట్టాలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు పరీక్షలు రాసిన విద్యార్థులు విఫలం కాలేదు. సీబీఎస్ఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షలను సమర్థంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా విఫలమైంది.

ఈ అంశంపై రాహుల్ గాంధీ సహా ప్రతిపక్షాలు పలుమార్లు కేంద్రాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. దేశ యువత వీధుల నుంచి పార్లమెంట్ వరకు తమ శక్తిని ప్రదర్శించింది. ప్రధానమంత్రి రాజీనామాను యువత కోరుతున్న పరిస్థితుల్లో.. ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పించడం ద్వారా కేంద్రం నష్టనివారణ చర్యలకు దిగింది. అదే సమయంలో విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలి. నీట్ లీకేజీ కారణంగా పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి. అదేవిధంగా ప్రధాని మోదీ.. దేశ యువతకు క్షమాపణ చెప్పాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, ఫార్చ్యూన్500 కంపెనీల సీఈఓలుగా రాణిస్తున్నారు.

అలాంటి యువత దేశ రాజకీయాల్లో ఎందుకు భాగస్వాములు కాలేరు? కాబట్టి ప్రస్తుత చట్టాలను కూడా కాలానుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు.. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 30 ఏళ్ల నుంచి 25 ఏళ్లకు తగ్గించాలి. ఈ మేరకు రానున్న అసెంబ్లీ, మండలి సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. పార్లమెంట్ సమావేశాల్లో సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్, ఎన్నికల్లో పోటీచేసే వయోపరిమితి తగ్గింపుపై సమగ్రంగా చర్చించాలి. అవసరమైతే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసి.. అన్ని రాజకీయ పక్షాలు, భాగస్వామ్య వర్గాల అభిప్రాయాలను తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## హెచ్ఆర్‌సీ అధికారాలపై స్పష్టత

(మొదటి పేజీ తరువాయి)




ఈ ఫిర్యాదులపై హెచ్ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సంబంధిత సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం సంబంధిత వాదనలు పరిశీలించింది.

ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు, కార్యాలయ అంతర్గత వ్యవహారాలు యజమాని, ఉద్యోగుల మధ్య పరిష్కరించాల్సిన అంశాలని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి వివాదాల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టాలు, న్యాయపరమైన వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రత ఆధారంగా హెచ్ఆర్‌సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని స్పష్టం చేసింది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వంటి ఫిర్యాదుల పరిష్కారానికి మహిళలపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం కింద ఏర్పాటు చేసిన అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఆశ్రయించాల్సి ఉంటుందని ధర్మాసనం సూచించింది. సంబంధిత చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న న్యాయపరమైన మార్గాల ద్వారానే బాధితులు న్యాయం పొందాలని పేర్కొంది.

ఈ నేపథ్యంలో హెచ్ఆర్‌సీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే బాధితులకు ఇతర చట్టపరమైన మార్గాల్లో న్యాయం కోరే హక్కు పూర్తిగా కొనసాగుతుందని తీర్పులో స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన ఉద్యోగ వివాదాలు, పనిప్రదేశ వేధింపుల అంశాల్లో హెచ్ఆర్‌సీ అధికార పరిధిపై స్పష్టత వచ్చినట్లు న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటువంటి ఫిర్యాదులు సంబంధిత ప్రత్యేక చట్టాలు, చట్టబద్ధ కమిటీల ద్వారానే పరిష్కరించాల్సి ఉంటుందని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది.



## బాలభరోసాతో భరోసా

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

మేధో వైకల్యం ఉన్న చిన్నారులకు సేవలందిస్తున్న సాధన సంస్థను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మేధో వైకల్యం ఉన్న పిల్లల అభివృద్ధి కోసం సంస్థ అందిస్తున్న సేవలను మంత్రి అభినందిస్తూ, వారి అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, విద్య, పునరావాసం, చికిత్స తదితర అంశాల్లో సంస్థ చేస్తున్న కృషిని మంత్రి పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి సంస్థ చేస్తున్న ప్రయత్నాలు ఆదర్శప్రాయమని అన్నారు. ఇలాంటి సేవా సంస్థలు సమాజంలో మరింత ప్రోత్సాహం పొందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం సమగ్ర వైద్య సేవల కల్పనకు కట్టుబడి ఉందని దామోదర రాజనర్సింహ తెలిపారు. చిన్నారుల్లో అభివృద్ధి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ దిశగా అమలు చేస్తున్న బాలభరోసా కార్యక్రమం ద్వారా చిన్నారులకు సకాలంలో వైద్య సేవలు, చికిత్స, పునరావాస సదుపాయాలు అందిస్తున్నామని వివరించారు. అభివృద్ధి లోపాలను తొలిదశలోనే గుర్తించడం వల్ల పిల్లల భవిష్యత్తును మరింత మెరుగుపరచవచ్చని మంత్రి పేర్కొన్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించడం, నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు నిరంతర పర్యవేక్షణ కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సాధన సంస్థ చేస్తున్న సేవలు మరింత విస్తరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. మేధో వైకల్యం ఉన్న చిన్నారులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా అవసరమైన సహకారం, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు, నాణ్యమైన వైద్య సేవలు, పునరావాస సదుపాయాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.





# ప్రజా భవన్‌లో బోనాలు

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజా భవన్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులతో కలిసి నల్లపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ పండుగను ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో బోనాల ఉత్సవాలు మరింత వైభవంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

పూజల అనంతరం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా భవన్‌కు విచ్చేసిన భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా ఈ వేడుకలు కొనసాగాయి. ప్రజా భవన్‌లో నిర్వహించిన నల్లపోచమ్మ బోనాల వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి సంవత్సరం ఇలాంటి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)



స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న సందర్భంగా ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా జల సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని, ప్రతి ఇంటా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, ప్రకృతి అనుకూల జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించిన విషయాలను ఆయన గుర్తు చేశారు. దేశీయ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మన సంప్రదాయ వారసత్వాన్ని కాపాడటంతో పాటు లక్షలాది మంది నేత కార్మికులకు ఉపాధి భద్రత కల్పించవచ్చని ప్రధానమంత్రి చేసిన పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రామచందర్ రావు కోరారు. స్థానికంగా తయారయ్యే వస్త్రాలను వినియోగించడం దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలాన్నిస్తుందని తెలిపారు.

మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి సామాన్య ప్రజలతో నేరుగా మమేకమవుతూ దేశ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలను నిరంతరం ప్రస్తావిస్తున్నారని రామచందర్ రావు అన్నారు. ప్రజల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, దేశభక్తిని పెంపొందించే సందేశాలు ఈ కార్యక్రమంలో ప్రతిసారి ఉంటాయని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగాలంటే ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రధానమంత్రి సూచించిన జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం వంటి అంశాలను నిత్య జీవితంలో అమలు చేయాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. సమష్టి కృషితోనే వికసిత భారత లక్ష్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

## అనారోగ్యంతో ఆస్పత్రిలో నటుడు రమేశ్..

# రూ.3 లక్షల సాయం చేసిన చిరంజీవి



హైదరాబాద్, జూలై 26, తెలంగాణ ముచ్చట్లు:

టాలీవుడ్ నటుడు రమేశ్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో రమేశ్ కుటుంబానికి మెగాస్టార్ చిరంజీవి ఆర్థిక చేయూత అందించారు. అత్యవసర వైద్య ఖర్చుల కోసం రమేశ్ భార్యకు రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అంతేకాకుండా, రమేశ్ చికిత్సకు అయ్యే ఖర్చులకు ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం వర్తించేలా అవసరమైన సహకారం అందిస్తామని చిరంజీవి హామీ ఇచ్చారు.

ఆపదలో ఉన్న సినీ కళాకారులకు, సినీ కార్మికులకు గతంలోనూ పలుమార్లు అండగా నిలిచిన చిరంజీవి, మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. రమేశ్‌కు ఆయన అందించిన సహాయంపై అభిమానులు, సినీ ప్రముఖులు చిరంజీవిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పెద్దమందడి మండల కుమ్మర యువజన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**పెద్దమందడి,జూలై26(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం పిలుపు మేరకు ఆదివారం వనపర్తి జిల్లా పెద్దమందడిలో నిర్వహించిన సమావేశంలో మండల కుమ్మర యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్. రాఘవేందర్, అధ్యక్షుడిగా బొడ్డుపల్లి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె. శేఖర్, కోశాధికారిగా కె. శేఖర్ ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి గంగమ్మ మాట్లాడుతూ.. కుమ్మర సంఘాన్ని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసేందుకు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. స్టీరింగ్ కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి నరసింహ మాట్లాడుతూ.. మట్టి కుండల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ సంఘ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు బొడ్డుపల్లి మన్నెంకొండ, శివ, గుణగంటి నరేందర్, లక్ష్మీనారాయణ, రవి, రామకృష్ణ, శ్రీరాజు, పవన్, ఎస్. భీమన్న, జయరాములు, కొండన్న, రాములు, కృపాకర్ పాల్గొన్నారు.

# వెల్టూర్ స్టేజీ వద్ద లారీ బోల్తా.. ఎన్‌హెచ్-44పై ట్రాఫిక్‌కు అంతరాయం



**పెద్దమందడి,జూలై26(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ సమీపంలో ఆదివారం సాయంత్రం ప్లైవుడ్ షీట్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడటంతో ఎన్‌హెచ్ 44పై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.స్థానికుల వివరాల ప్రకారం.. కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెల్టూర్ స్టేజీ దాటిన అనంతరం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి రహదారిపై బోల్తాపడింది. లారీ రహదారికి అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో దాదాపు అర కిలోమీటర్ మేర వాహనాలు బారులుతీరి నిలిచాయి.ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్డుపై వాహనాలను మళ్లించడంతో రాకపోకలు క్రమంగా పునరుద్ధరించబడ్డాయి. అయితే సర్వీస్ రోడ్డుపై రద్దీ పెరగడంతో ప్రయాణికులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం క్రేన్ సాయంతో లారీని తొలగించి ట్రాఫిక్‌ను పూర్తిగా పునరుద్ధరించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వావిలాల రజక సంఘానికి నూతన కమిటీ



- **అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడికి ఘన సన్మానం**

**జమ్మికుంట టౌన్ జులై 26 (తెలంగాణ ముచ్చట్లు):**జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు దబ్బేట రవీందర్ ఆధ్వర్యంలో రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బొడ్డు ఓదెలు, గౌరవాధ్యక్షుడిగా కాసర్ల ఓదెలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం నివాసంలో ఘనంగా శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని, రజక సంఘం అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# మాతృత్వాన్ని కవిత్వంగా మలిచిన కవికి ఘన సన్మానం



**వనపర్తి,జూలై26(తెలంగాణ ముచ్చట్లు):** మాతృమూర్తుల త్యాగం, ప్రేమ, గొప్పతనాన్ని హృద్యమైన కవిత్వంగా ఆవిష్కరించిన ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్యకు సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆదివారం నాగర్‌కర్నూల్‌లో ఘనంగా సన్మానం నిర్వహించారు. తమ పిల్లలను ఉత్తమ కవులు, రచయితలుగా తీర్చిదిద్దిన పన్నెండుమంది తల్లుల జీవితాలను ప్రతిబింబిస్తూ ఆయన రచించిన 'పసరంటిన కొడవలి' కవితా సంపుటిని ఈ సందర్భంగా కొనియాడారు.సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. అమ్మ లేని జీవితం ఊహించలేమని, కుటుంబం కోసం తన జీవితాన్నంతా త్యాగం చేసే మహోన్నత వ్యక్తి తల్లేనని అన్నారు. పసరంటిన కొడవలి లోని ప్రతి కవిత పాఠకులకు తమ తల్లి ప్రేమ త్యాగాలను గుర్తు చేస్తుందని, ఇటువంటి విలువైన రచనలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, డా. బి. శ్యాంసుందర్, తులసి కుమార్, దేవరాజ్ తదితరులు పాల్గొని వనపట్ల సుబ్బయ్యను అభినందించారు.

# అమ్మకు ప్రత్యామ్నాయం లేదు.. సకల జీవరాశులకు అమ్మే అండ

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,జూలై26(తెలంగాణ ముచ్చట్లు):** అమ్మకు ఈ ప్రపంచంలో ప్రత్యామ్నాయం లేదని, సకల జీవరాశులకు అమ్మే అండగా నిలుస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. నేల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన పసరంటిన కొడవలి కవితా సంపుటి ఆవిష్కరణ సభ నాగర్‌కర్నూల్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిరంజన్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనపట్ల సుబ్బయ్యలో విశేష ప్రజ్ఞ, ప్రతిభ ఉన్నప్పటికీ ఆడంబరం, ఆర్భాటం లేకుండా సాధారణ జీవితం గడపడం అభినందనీయమన్నారు. కులవృత్తిని కొనసాగిస్తూనే ప్రవృత్తిగా కవిత్వాన్ని ఎంచుకుని సమాజాన్ని ప్రభావితం చేసే 15 పుస్తకాలను రచించడం సమాజ శ్రేయస్సుకు దోహదపడే కృషిగా అభివర్ణించారు.ఈ ప్రపంచంలో ఆహారం, మాతృదేశం, అమ్మకు ప్రత్యామ్నాయం లేదని పేర్కొంటూ, మాతృమూర్తి ద్వారానే మానవ సంబంధాలు, సామాజిక విలువలు, ఆర్థిక క్రమశిక్షణ, సమాజంలోని మంచి-చెడులపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి మనిషి వ్యక్తిత్వ వికాసంలో తల్లి పాత్ర అత్యంత కీలకమని, తన జీవితంపై తల్లిదండ్రులు తారకమ్మ, రామ్‌రెడ్డి ప్రభావం ఎంతో ఉందని గుర్తు చేసుకున్నారు. రానున్న భవిష్యత్తు యువతదేనని, వారికి పెద్దలు ఆదర్శంగా నిలిచి మంచి విలువలను అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, చింతపల్లి భాస్కర్‌రావు, వాసుదేవుడు, ఆచార్య కోయి కోటేశ్వర్‌రావు, నాగవరం బాల్‌రామ్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం రచయిత వనపట్ల సుబ్బయ్యను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# ప్రతిభకు పట్టం కట్టిన ఆవోపా.. మెరిట్ విద్యార్థులకు అవార్డుల వర్షం




**జమ్మికుంట టౌన్ జులై 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవోపా-2026 మెరిట్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ఇలాంటి సత్కారాలు మరింత మంది విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని పేర్కొన్నారు. ఆవోపా కుటుంబం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని, అలాగే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కూడా అండగా నిలిచి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు. సమాజంలో విద్యకు ప్రాధాన్యత కల్పిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న ఆవోపా సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందా రాజు, రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం, వీర బొమ్మ రమేష్, సామ నారాయణ, పీవీ రామకృష్ణ, బచ్చు రమేష్, లెంకలపెల్లి శరత్, సుధాకర్, రమేష్, పద్మ, అకినపెల్లి శ్రీనివాస్, కొండ్లే నాగేష్, రాంబాబు తదితరులు, ఆవోపా కుటుంబ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జమ్మికుంటలో ఘనంగా అవోపా మెరిట్ అవార్డ్స్–2026



- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

**జమ్మికుంట,జులై26(తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఆర్యవైశ్య అవోపా జమ్మికుంట ఆధ్వర్యంలో ఆదివారం "అవోపా మెరిట్ అవార్డ్స్-2026" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు, ప్రముఖులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్యవైశ్య విద్యార్థులను మెమెంటోలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. సంఘ నాయకులు, ప్రతినిధులు విద్యార్థులకు అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన అవోపా నాయకులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మెరిట్ అవార్డుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఏడాది ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. అవోపా అధ్యక్షుడు అకినపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్, సామా నారాయణ, పి.వి. రామకృష్ణ, జిల్లా బాధ్యుడు ఐత సుధాకర్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లెంకళ్లపల్లి శరత్ కుమార్, జమ్మికుంట అవోపా ప్రధాన కార్యదర్శి నగేష్, మంచాల రాంబాబు, జోన్ ట్రెజరర్ బచ్చు రమేష్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో సాహు మహారాజ్ జయంతి



- బడుగు వర్గాల అభ్యున్నతికి సాహు స్ఫూర్తి

**హుజురాబాద్, జూలై 26(తెలంగాణ ముచ్చట్లు ):** ఛత్రపతి సాహు మహారాజ్ 152వ జయంతి ఉత్సవాలను హుజురాబాద్ పట్టణంలోని స్థానిక టిడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ముఖ్య అతిథిగా హాజరై సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, విద్యా అవకాశాలు, మహిళా సాధికారత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఛత్రపతి సాహు మహారాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. 1902లో రిజర్వేషన్ల అమలుకు ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం వల్లే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లకు స్థానం కల్పించారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సాహు మహారాజ్ ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆయన సేవలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపి రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, కొలిపాక క్రాంతి, మున్సిపల్ కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ తడికమళ్ల శేఖర్, బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి దేవసాని ప్రియదర్శిని, ప్రధాన కార్యదర్శి గజ్వేల్ మధుసూదన్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు ఆడెపు సురేందర్, మల్లేశం, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# ఉత్తర తెలంగాణ పాటలపై పరిశోధనకు డాక్టరేట్..

- ఆవాల హరిబాబు ఘనత.



**వీణవంక జులై 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తర తెలంగాణ ప్రజా ఉద్యమాలు, సామాజిక చైతన్యంలో పాటల పాత్రను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ పరిశోధన పూర్తి చేసిన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన ఆవాల హరిబాబు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (పిహెచ్‌డీ) పట్టా అందుకున్నారు.
ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో "ఉత్తర తెలంగాణ పాటలు - సామాజిక చైతన్యం" అనే అంశంపై ప్రొఫెసర్ చింతకింది కాశీం పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు, సామాజిక పోరాటాలు, సాంస్కృతిక వారసత్వం, ప్రజా ఉద్యమాల్లో పాటలు పోషించిన పాత్రను సమగ్రంగా విశ్లేషిస్తూ ఈ సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఉత్తర తెలంగాణ నేలపై జరిగిన ప్రతి ఉద్యమం వెనుక ఒక పాట, ప్రతి పాట వెనుక ఒక చరిత్ర, ఆ చరిత్ర వెనుక ప్రజల ఆకాంక్ష దాగి ఉందనే భావనతో ఈ పరిశోధన చేపట్టినట్లు హరిబాబు తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో రూపుదిద్దుకున్న పాటలు అన్యాయాన్ని ప్రశ్నించడంలో, దోపిడీని ప్రతిఘటించడంలో, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో, సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రజలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించాయని తన పరిశోధనలో వివరించారు. ఈ సందర్భంగా తన పరిశోధన పర్యవేక్షకులు ప్రొఫెసర్ చింతకింది కాశీం, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధ్యాపకులు, సమాచారం అందించిన ప్రజా కవులు, కళాకారులు, మిత్రులు, కుటుంబ సభ్యులకు హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించిన ఆయనను పలువురు సాహితీవేత్తలు, మేధావులు, ప్రజా కళాకారులు, మిత్రులు అభినందించారు.


# కార్గిల్ వీరుల త్యాగం చిరస్మరణీయం

## డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి




**వనపర్తి,జూలై26( తెలంగాణ ముచ్చట్లు):** కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ విజయ్ దివాస్ భారత చరిత్రలో గర్వించదగ్గ రోజని, భారత సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తికి ఇది చిరస్మరణీయ నిదర్శనమని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన సైనికులకు యావత్ దేశం రుణపడి ఉంటుందని, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.కార్గిల్ యుద్ధంలో బోఫోర్స్ గన్స్ కీలక పాత్ర పోషించాయని, భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని అన్నారు. జై జవాన్ - జై కిసాన్ స్ఫూర్తితో యువతలో దేశభక్తి భావన పెంపొందాలని, దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజేంద్రప్రసాద్ యాదవ్, నాగార్జున, నరహరి, బాబా, ఎత్తం చరణ్ రాజ్, మన్యం యాదవ్, ద్వారాపోగు విజయ్ బాబు, ఎస్.ఎల్. రమేష్, నందిమల్ల రామ్, వెంకటేష్, వెంకటన్న, సోషల్ మీడియా రాజు తదితరులు పాల్గొన్నారు.






# గూడూరులో 100% ఎస్ ఐ ఆర్ పూర్తి.. బీఎల్ఓకు ఘన సన్మానం

- కాంగ్రెస్ నాయకుల కృషికి ప్రశంసలు

**హుజురాబాద్ ,జులై 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం గూడూరు గ్రామం 287వ బూత్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఓ కుమ్మరి కోమాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంలో బీఎల్ఓ చూపిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.
ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమం కోఆర్డినేటర్ తౌటం మాట్లాడుతూ, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కమలాపూర్ మండలంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలిస్తూ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. గూడూరు గ్రామం 287వ బూత్‌లో 100 శాతం ఎస్ ఐ ఆర్ పూర్తి కావడం ఇతర బూత్‌లకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.
అలాగే కమలాపూర్ మండలంలోని మిగిలిన అన్ని బూత్‌లలో కూడా త్వరలోనే 100 శాతం ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని, ప్రతి ఒక్కరి సహకారంతో లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.
గూడూరు గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి విశేషంగా కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్, గాలిబు నవీన్, కొండపాక మనీష్, గాలిబు శంకర్, శివానందం తదితరులను తౌటం ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్థుల సహకారం, బీఎల్ఏల సమన్వయం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, గ్రామ ప్రజలు పాల్గొని 100 శాతం ఎస్ ఐ ఆర్ పూర్తి చేసిన బీఎల్ఓ కుమ్మరి కోమాలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పద్మశాలి ప్రజాప్రతినిధులు, చేనేత సంఘ నాయకులకు ఘన సన్మానం





- రాజకీయాల్లో రాణించి సమాజాభివృద్ధికి సేవ చేయాలని పిలుపు

**కమలాపూర్, జూలై 26(తెలంగాణ ముచ్చట్లు ):** కమలాపూర్ మండల కేంద్రంలో కమలాపూర్ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, బొప్ప శివశంకర్ అధ్యక్షతన ఆదివారం పద్మశాలి ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల నూతన కార్యవర్గ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన కమలాపూర్, మర్రిపల్లిగూడెం, గోపాలపురం చేనేత సహకార సంఘాల కార్యవర్గ సభ్యులతో పాటు మండలంలోని పద్మశాలి సర్పంచులు, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ మాట్లాడుతూ, పద్మశాలి సమాజం ఐక్యతతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించగలదన్నారు. చేనేత రంగ పరిరక్షణతో పాటు యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, మండలంలో పద్మశాలి సామాజిక వర్గానికి మెజార్టీ ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు. సమాజం ఐక్యంగా ఉండి స్థానిక సంస్థలతో పాటు శాసనసభ, పార్లమెంట్ స్థాయిలో కూడా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతం, నేతన్నల ఆర్థికాభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యం రాజగోపాల్, నేతన్న టీవీ అధినేత పులికంటి రాజేందర్ మాట్లాడుతూ చేనేత రంగానికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని, నేతన్నల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేదాసి వెంకటేశ్వర్లు, నల్ల సత్యనారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోరండ్ల కుమారస్వామి, బైరి సహదేవ్, తుమ్మ శోభన్ బాబు, మెండు రమేష్, చేరాల రోహిత్, చేనేత సంఘ అధ్యక్షులు బైరి జనార్ధన్, పోరండ్ల రమేష్, మామిడాల రమేష్, సర్పంచులు మిట్టపల్లి మల్లీశ్వరి కుమార్, బూర రాధిక, తుమ్మ స్వాతి రాజేష్, మాజీ సర్పంచ్ పోరండ్ల రమేష్, ఖ్యాతం రవీందర్, మెండు రాంబాబు, చీరాల సారంగం, చేనేత సంఘం మేనేజర్ సామల దామోదర్, తుమ్మరాజు, కనుకుంట్ల ఆంజనేయులుతో పాటు పద్మశాలి సంఘ నాయకులు, చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమం అనంతరం సన్మానితులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పద్మశాలి సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక






# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చలో ఢిల్లీ

**జర్నలిస్ట్ ఎర్రమన్ను బాలరాజు**

**వనపర్తి,జూలై26(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ ధర్నా కార్యక్రమానికి జర్నలిస్ట్ ఎర్రమన్ను బాలరాజు ఆదివారం హైదరాబాద్ నుంచి బయలుదేరారు.దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల అమలు, అక్రిడిటేషన్ కార్డుల జారీ, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని ఎర్రమన్ను బాలరాజు పిలుపునిచ్చారు.

# పనిమనుషుల నియామకంలో అప్రమత్తత అవసరం



**హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో పనిమనుషుల ద్వారా జరుగుతున్న దొంగతనాల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. పనిమనుషులను నియమించుకునే సమయంలో సరైన వివరాలు సేకరించకుండా, పోలీస్ వెరిఫికేషన్ చేయించకుండా ఉద్యోగంలోకి తీసుకోవడం వల్లే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. గత రెండేళ్లలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 565 పనిమనుషుల దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిలో 65 తీవ్రమైన కేసులు, 500 సాధారణ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. పనుల ఒత్తిడితో ఉండే ఐటీ ఉద్యోగులు, ఒంటరిగా నివసించే విద్యార్థులు, వృద్ధులు ఈ తరహా నేరాలకు ఎక్కువగా గురవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇళ్లు, కార్యాలయాలు, దుకాణాల్లో నగదు, బంగారం, విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచడాన్ని గమనించిన కొందరు పనిమనుషులు అవకాశం చూసి చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే, ముందుగానే భద్రతా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని పోలీసులు సూచించారు. జోన్లవారీగా పరిశీలిస్తే జూబ్లీహిల్స్ జోన్‌లో అత్యధికంగా 173 కేసులు నమోదయ్యాయి. సికింద్రాబాద్ జోన్‌లో 88, ఖైరతాబాద్‌లో 77, గొల్కొండలో 70, రాజేంద్రనగర్‌లో 63, శంషాబాద్‌లో 49, చార్మినార్ జోన్‌లో 45 కేసులు నమోదయ్యాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు పనిమనుషుల పేరుతో ఇళ్లలోకి ప్రవేశించి పథకం ప్రకారం నేరాలకు పాల్పడుతున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయని పోలీసులు తెలిపారు. ప్రతి యజమాని పనిమనిషిని నియమించుకునే ముందు ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం, తాజా ఫొటో, శాశ్వత చిరునామా, స్వగ్రామం వివరాలు, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకం చేపట్టినప్పటికీ, ఆ సంస్థకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో నిర్ధారించుకోవాలని, గతంలో పనిచేసిన చోట్ల వివరాలు ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉచితంగా పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పనిలో చేరిన తొలి నెల రోజుల పాటు వారి కదలికలు, ప్రవర్తనను గమనించాలని పోలీసులు సూచించారు. ఇంట్లోని నగలు, నగదు, తాళాల వివరాలు, ప్రయాణ ప్రణాళికలు వంటి విషయాలను పనిమనుషుల ముందు చర్చించవద్దని హెచ్చరించారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సంఘాలు ఎంట్రీ రిజిస్టర్లు నిర్వహించడం, ప్రవేశ పాస్‌లు జారీ చేయడం, సీసీ కెమెరాలను నిరంతరం పనిచేసేలా చూడడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. నగర భద్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పేర్కొన్నారు. పోలీస్ వెరిఫికేషన్ లేని వ్యక్తులను పనిలోకి తీసుకోవద్దని, అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా, తాళాలు పోయినా లేదా పనిమనిషి అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా వెంటనే డయల్ 100 లేదా హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సాప్ సహాయ కేంద్రం 94906 16555కు సమాచారం అందించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలతోనే పనిమనుషుల దొంగతనాలను సమర్థంగా నివారించవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

***18 ఏండ్ల తర్వాత కలయిక***

***ఆనందోత్సహంగా గేట్ టూ గెదర్***



**ఖమ్మం బ్యూరో, జులై 26(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లా పరిషత్ నేరడ పాఠశాలలో 2008 సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఖమ్మం నగరంలోని కావేరి రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. దాదాపు 18 సంవత్సరాల అనంతరం కలుసుకున్న మాజీ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఉపాధ్యాయులకు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పూర్వ విద్యార్థులు, గురువులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. సమ్మేళనంలో భాగంగా గ్రూప్ ఫోటోలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కేక్ కటింగ్ నిర్వహించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, ప్రతి సంవత్సరం సమ్మేళనం నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలి

- **ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం .డి యూసఫ్**





**ఖమ్మం బ్యూరో, జులై 26(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఎక్కడ మీటింగ్ జరిగిన ప్రతినెలా ఒకటవ తేదీనే కార్మికులకు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం ఒకటవ తేదీనే జీతాలు ఎందుకు చెల్లించడం లేదో సమాధానం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12వేల గ్రామపంచాయతీలో 54,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని వారందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. 1986 సంవత్సరం నుండి ఇంతవరకు గ్రామపంచాయతీ వర్కర్స్ ను నియమించటానికి ఒక్క పర్మినెంట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదంటే ఈ కార్మికులపై ప్రభుత్వాలు ఎంత వివక్షత చూపుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశము కల్పించాలన్నారు. సహజ మరణానికి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాన్ని కార్మికులకు వెంటనే కల్పించాలన్నారు. రెండు మూడు దశాబ్దాలు పైగా పని చేసిన కార్మికులు 60 సంవత్సరాల నిండిన తర్వాత ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లవలసి వస్తుందని, సత్తువ మొత్తం వెట్టి చాకిరికే పోతుందని ఆయన వాపోయారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికులకు 10 లక్షల రూపాయల సింగిల్ టైం గ్రాడ్యుటీ కింద మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అర్హతను బట్టి కార్మికులకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నత కల్పించాలన్నారు. రాబోవు పిఆర్సి లో గ గ్రామపంచాయతీ కార్మికులను అనువర్తింపజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్ , వెంకటరాజం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామపంచాయతీ ఉద్యోగ & కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మురళి, పిట్టల మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, రఘునాపాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ ల సంఘం బోనకల్ మండల అధ్యక్షులుగా పల్లా కొండలరావు




**ఖమ్మం బ్యూరో, జులై 26(తెలంగాణ ముచ్చట్లు ):** బోనకల్ మండల ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులుగా పల్లా కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బోనకల్ లో జరిగిన సభలో చొప్పకట్లపాలెం ఉప సర్పంచ్ పల్లా కొండలరావు అధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శిగా అమిరేసి సీతయ్య (ముష్టికుంట్ల), వర్కింగ్ ప్రెసిడెంట్ గా కరివేద కనకారావు (నారాయణపురం), ఉపాధ్యక్షులుగా గంగధరి భూపతిరావు (జానకీపురం), ప్రచార కమిటీ కన్వీనర్ గా పెద్దప్రోలు రామారావు (పెద్ద బీరవల్లి) ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్ లు హాజరయ్యారు. ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం ఇవ్వాలని, శిలాఫలకాలపై ఉప సర్పంచ్ ల పేర్లు పెట్టాలని, మండల జనరల్ బాడీ లకు ఉప సర్పంచ్ లను ఆహ్వానించాలని, విడిసి లతో పాటు అన్ని తీర్మానాలపై ఉప సర్పంచ్ ల సంతకాలు ఉండాలని ఈమేరకు అన్ని మండలాల ఎంపిడీఓ, డిపిఓలకు వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బంధు యేకయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , శ్రీధర్ సుధాకర్ , ఖమ్మం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సాంబశివరావు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన అనహత్ సింగ్..



**నియాగరా-ఆన్-ది-లేక్ (కెనడా), జూలై 26, 2026, (తెలంగాణ ముచ్చట్లు):** భారత యువ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో చరిత్ర సృష్టించింది. మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డులకెక్కింది. కెనడాలో జరిగిన ఫైనల్లో ఈజిప్ట్‌కు చెందిన రెండో సీడ్ రుఖయ్యా సలేంను 113, 117, 119 తేడాతో వరుస గేముల్లో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.

టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన అనహత్ టోర్నీ మొత్తం అద్భుత ప్రదర్శన కనబరిచింది. గత ఏడాది కాంస్య పతకంతో సరిపెట్టుకున్న ఆమె, ఈసారి ఒక్క గేమ్ కూడా వదలకుండా ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. ఈ విజయంతో 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఈజిప్ట్ ఆధిపత్యానికి తెరదించడంతో పాటు, 2010 తర్వాత జూనియర్ ప్రపంచ స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి నాన్‌ఈజిప్షియన్ క్రీడాకారిణిగా నిలిచింది.

అంతకుముందు సెమీఫైనల్లో ఈజిప్ట్‌కే చెందిన బార్బ్ సమీహ్‌ను ఓడించిన అనహత్, 21 ఏళ్ల తర్వాత ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయురాలిగా కూడా గుర్తింపు పొందింది. ఫైనల్‌కు చేరిన తర్వాత టోర్నీ ఇంకా ముగియలేదని చెప్పిన అనహత్, అదే ఆత్మవిశ్వాసాన్ని ఫైనల్లోనూ కొనసాగించి తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విజయాన్ని అందుకుంది. అనహత్ సాధించిన ఈ చారిత్రక విజయం భారత స్క్వాష్‌కు కొత్త ఊపునిచ్చింది. ప్రపంచ వేదికపై భారత జెండాను రెపరెపలాడించిన ఆమె విజయంపై క్రీడా ప్రపంచం ప్రశంసలు కురిపిస్తోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# గ్లామర్‌తో ఆకట్టుకుంటున్న రితికా నాయక్..



'కళ్యాణం' సినిమాతో రెండో కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రితికా నాయక్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. అనంతరం 'మిరాయి' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ యువ నటి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. రితికా చేతిలో ప్రస్తుతం 'డ్యుయెట్'తో పాటు వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' ఉన్నాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

ఇదిలా ఉంటే, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రితికా నాయక్ తాజాగా షేర్ చేసిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. వైబ్రెంట్ ఫ్లోరల్ స్కర్ట్, వైట్ షర్ట్, గోల్డెన్ జ్యువెలరీతో స్టైలిష్ లుక్‌లో కెమెరాకు ఇచ్చిన పోజులు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి.

చబ్బీ, క్యూట్ లుక్‌తో మెరిసిన రితికా ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'మిరాయి' బ్యూటీ కొత్త స్టైల్ అభిమానులను ఆకట్టుకుంటుండగా, ఆమె నటిస్తున్న రాబోయే సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఎన్నికలకు సిద్ధరామయ్య గుడ్‌బై

- **2028 ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టీకరణ**
- **ఎన్నికల రాజకీయాలకు వీడ్కోలు ప్రకటించిన మాజీ సీఎం**
- **ప్రజా జీవితంలో మాత్రం కొనసాగుతానని వెల్లడి**
- **ప్రకటనతో కర్ణాటక రాజకీయాల్లో చర్చ**

**బెంగళూరు, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎన్నికల రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేశారు. అయితే ప్రజా జీవితానికి దూరం కాబోనని, ప్రజల సమస్యలపై గతంలాగే తన గొంతు వినిపిస్తూనే ఉంటానని వెల్లడించారు. మండ్య జిల్లా కే.ఆర్.పేటలో జరిగిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం రాజకీయాలు అత్యంత కలుషితంగా మారాయని, నిజాయతీతో కూడిన రాజకీయాలకు అనుకూల పరిస్థితులు కనిపించడం లేదని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో ఇకపై ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2028 నాటికి తన వయసు 82 సంవత్సరాలు అవుతుందని, ప్రస్తుతం ఉన్న ఉత్సాహంతో అప్పట్లో పనిచేయడం సాధ్యం కాకపోవచ్చని పేర్కొన్నారు. అందుకే ఎన్నికల బరిలోకి దిగకుండా ప్రజా సేవను కొనసాగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సిద్ధరామయ్య ప్రకటనతో అక్కడున్న మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు భావోద్వేగానికి గురయ్యారు. మరో పదేళ్లపాటు రాజకీయాల్లో కొనసాగాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అయితే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. అనంతరం సామాజిక మాధ్యమ వేదికలో కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ, ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని వెల్లడించారు. వరుణ నియోజకవర్గ ప్రజలు మరోసారి పోటీ చేయాలని కోరుతున్నప్పటికీ, తాను తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించాలని ఆయన కోరారు. గతంలో ఎన్నికల్లో ప్రజలే అభ్యర్థులకు ఆర్థికంగా అండగా నిలిచేవారని, కానీ ఇప్పుడు ఎన్నికల వ్యవస్థ పూర్తిగా మారిపోయిందని అన్నారు. రాజకీయాల్లో ఎన్నికల ఖర్చులు విపరీతంగా పెరగడం ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే అంశమని అభిప్రాయపడ్డారు.

1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సిద్ధరామయ్య, 2028 నాటికి ప్రజా జీవితంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోనున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలు, పరాజయాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదని చెప్పారు. తన అంతరాత్మకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రజలు చూపిన ఆదరణకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. రెండు పర్యాయాలుగా కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన తాజా ప్రకటనతో కర్ణాటక రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. గతంలో కూడా ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ, ఈసారి ఎన్నికల రాజకీయాలకు వీడ్కోలు పలుకుతున్నట్లు స్పష్టంగా ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఇంటింటికీ కూటమి పాలన

- **రేపటి నుంచి 45 రోజుల డోర్ టు డోర్ కార్యక్రమం**
- **ప్రజలకు ప్రభుత్వ విజయాలు వివరించాలని దిశానిర్దేశం**
- **ప్రతి నాయకుడు ప్రజల్లో ఉండాలని చంద్రబాబు పిలుపు**
- **స్థానిక ఎన్నికలపై పార్టీ శ్రేణులకు సూచనలు**



**అమరావతి, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల డోర్ టు డోర్ కార్యక్రమాన్ని చేపట్టనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు పేర్కొన్నారు. 94 శాతం స్థానాల్లో విజయం, 57 శాతం ఓట్లతో ప్రజలు కూటమికి బలమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత, కూటమి సమష్టి పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు కోరిన విధంగానే ఇప్పుడు కూడా ప్రజల గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని చంద్రబాబు సూచించారు. ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వ పనితీరుపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం కూడా ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పార్టీలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. తనకు అనుచరులు కాకుండా సమస్యలకు పరిష్కారం చూపగల నాయకులు కావాలని అన్నారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలతో సన్నిహితంగా మెలుగుతూ సేవా భావంతో పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# చైనాను వణికించిన నౌల్

- **గ్వాంగ్‌డాంగ్ తీరాన్ని తాకిన శక్తివంతమైన టైఫూన్**
- **ఏడు లక్షల మందికి పైగా ప్రజల తరలింపు**
- **హాంకాంగ్‌లో వందల విమాన సర్వీసుల రద్దు**
- **భారీ వర్షా లపై అత్యున్నత హెచ్చరికలు జారీ**



**బీజింగ్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్‌గా గుర్తింపు పొందిన 'నౌల్' దక్షిణ చైనాలో తీవ్ర విధ్వంసం సృష్టిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని హుయిడాంగ్ కౌంటీ తీరాన్ని ఈ తుపాను తాకడంతో భారీ ఈదురుగాలులు, కుండపోత వర్షాలు కురిశాయి. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యగా ఏడు లక్షల పదిహేను వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆదివారం ఉదయం సుమారు 3.50 గంటలకు తీరం దాటిన సమయంలో గంటకు 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచినట్లు చైనా వాతావరణ అధికారులు తెలిపారు. నౌల్ ఈ ఏడాది చైనాను తాకిన పన్నెండో ఉష్ణమండల తుపాను కాగా, ఈ నెలలో మూడో తుపానుగా నమోదైంది. గ్వాంగ్‌డాంగ్ తీర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడగా, ప్రజలు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్నారు. టైఫూన్ ప్రభావం హాంకాంగ్‌పై కూడా తీవ్రంగా కనిపించింది. హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక్కరోజే సుమారు 350 విమాన సర్వీసులను అధికారులు రద్దు చేయడంతో దాదాపు రెండు వేల మంది ప్రయాణికులు విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో రైలు సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. హాంకాంగ్‌లో బలమైన ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఒక ఎత్తైన భవనానికి ఏర్పాటు చేసిన పరంజా కూలిపోవడంతో తొమ్మిది మంది గాయపడినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ప్రస్తుతం టైఫూన్ భూభాగంలోకి ప్రవేశించి క్రమంగా బలహీనపడుతున్నప్పటికీ దాని ప్రభావం ఇంకా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఫుజియాన్, జియాంగ్సీ, హునాన్ తదితర దక్షిణ చైనా ప్రావిన్సుల్లో మంగళవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాలు, నదుల పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని చైనా ప్రభుత్వం అత్యున్నత స్థాయి హెచ్చరికలను జారీ చేసింది. సహాయక బృందాలు, అత్యవసర సేవలను రంగంలోకి దించి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పర్వత ప్రాంతాలు, లోయలు, నదుల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. కొరియన్ భాషలో 'నౌల్' అంటే 'సూర్యోదయం లేదా సూర్యాస్తమయం వెలుగు' అనే అర్థం ఉన్నప్పటికీ, ఈ తుపాను మాత్రం దక్షిణ చైనాలో తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని చైనా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

# అమిత్ షాకు రాహుల్ లేఖ

- **జంతర్ మంతర్ ఘటనపై తీవ్ర అభ్యంతరం**
- **విద్యార్థులపై బలప్రయోగంపై ప్రశ్నల వర్షం**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **కేంద్రం నుంచి ఇంకా అధికారిక స్పందన లేదు**



**న్యూఢిల్లీ, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థుల నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహించాలని కోరుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఆదివారం లేఖ రాశారు. విద్యార్థులపై జరిగిన బలప్రయోగాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ, ముఖ్యంగా పెల్లెట్ గన్ల వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 20న జంతర్ మంతర్ వద్ద న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు. అయితే భద్రతా బలగాలు విచక్షణా రహితంగా బలప్రయోగానికి పాల్పడ్డాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు పెల్లెట్ గన్లను కూడా ఉపయోగించడం వల్ల వందలాది మంది విద్యార్థులు గాయపడినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళా విద్యార్థినులపై కూడా దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అమిత్ షాను ఉద్దేశించి రాహుల్ గాంధీ రెండు ప్రశ్నలను సంధించారు. విద్యార్థులపై పెల్లెట్ గన్ల వంటి ఆయుధాలను ప్రయోగించేందుకు హోం మంత్రిగా అనుమతి ఇచ్చారా, ఇవ్వకపోతే ఆ నిర్ణయం ఎవరు తీసుకున్నారనే ప్రశ్నతో పాటు, సాధారణ దుస్తుల్లో వచ్చి విద్యార్థులను లాఠీలతో కొట్టిన వ్యక్తులు ఎవరు, వారిని రంగంలోకి దించింది ఎవరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. జంతర్ మంతర్ ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ ఇప్పటికే విమర్శలు గుప్పిస్తోంది. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని రాహుల్ గాంధీ లేఖలో కోరారు. అయితే రాహుల్ గాంధీ లేఖపై కేంద్ర హోం శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే అవసరమైన చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు గతంలో పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ స్పందన, తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## వెన్న తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందా?..
# నిజం ఏంటంటే!

**డెస్క్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):** వెన్న అంటే చాలా మందికి ఇష్టం. వేడి వేడి దోసెలు, చపాతీలు, బ్రెడ్, పరాటాలపై వెన్న వేసుకుని తినడం చాలామందికి అలవాటు. అయితే వెన్న తింటే శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుతుందా? గుండెకు హానికరమా? అనే సందేహాలు చాలామందిలో ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం వెన్నను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దాన్ని ఎంత మోతాదులో తీసుకుంటున్నామన్నదే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వెన్నలో సంతృప్త కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే అవకాశం కల్పిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ఎక్కువైతే అది రక్తనాళాల్లో పేరుకుపోయి రక్తప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందుకే వెన్నను రోజూ ఎక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. అయితే వెన్నలో కేవలం కొవ్వులే కాకుండా శరీరానికి ఉపయోగపడే కొన్ని పోషకాలు కూడా ఉంటాయి. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి, విటమిన్ డి ఎముకల బలానికి, విటమిన్ ఈ కణాలను రక్షించడంలో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా కొద్దిపాటి వెన్న శరీరానికి శక్తిని కూడా అందిస్తుంది. అందువల్ల పూర్తిగా మానేయడం కంటే పరిమితంగా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, అధిక రక్తపోటు లేదా ఇప్పటికే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు వెన్న తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి వారు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా మేరకు మాత్రమే వెన్నను ఆహారంలో చేర్చుకోవాలి. స్వయంగా నిర్ణయం తీసుకుని అధికంగా తినడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. వెన్నకు బదులుగా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాలను ఎంచుకోవడం మంచిది. బాదం, అక్రోట్లు, అవిసె గింజలు, నువ్వులు, వేరుశెనగలు, ఆలివ్ నూనె వంటి వాటిలో ఉండే మంచి కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. ఆహారంతో పాటు జీవనశైలి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు నడక, యోగా లేదా ఇతర వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలోని మంచి కొలెస్ట్రాల్ పెరిగి, చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి సహాయపడుతుంది. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండడం కూడా గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చాలామంది ఇంట్లో తయారుచేసిన వెన్న కాబట్టి ఎంత తిన్నా ప్రమాదం ఉండదని భావిస్తుంటారు. కానీ ఇంట్లో చేసిన వెన్న అయినా, మార్కెట్‌లో లభించే వెన్న అయినా అందులో ఉండే సంతృప్త కొవ్వుల పరిమాణంలో పెద్దగా తేడా ఉండదు. కాబట్టి ఏ రకమైన వెన్న అయినా మితంగా తీసుకోవడం అవసరం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వెన్నను సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలి.





# తెలంగాణకు నీటి అన్యాయం జరుగుతుంది

- కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ పరిశీలన
- కృష్ణా, భీమా జలాలపై ఆందోళన వ్యక్తం
- రైతులకు సాగునీరు అందే వరకు పోరాటం
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్

షాద్‌నగర్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):

కర్ణాటక ప్రభుత్వం కృష్ణా, భీమా నదులపై నిర్మిస్తున్న అక్రమ చెక్‌డ్యాంలు, బ్యారేజీలు, రిజర్వాయర్ల కారణంగా తెలంగాణకు రావాల్సిన నదీ జలాలకు తీవ్ర నష్టం జరుగుతోందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆరోపించారు. మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ బృందం ఆదివారం కృష్ణా, భీమా నదుల పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

కర్ణాటక ప్రభుత్వం హైడ్రాలిక్ గేట్లతో కూడిన చెక్‌డ్యాంలు, బ్యారేజీలు నిర్మించడం వల్ల సహజ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని అంజయ్య యాదవ్ అన్నారు. దీంతో తెలంగాణకు రావాల్సిన నీరు పై ప్రాంతాల్లోనే నిలిచిపోతోందని, దిగువ ప్రాంతాల్లోని రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వినియోగంలో నిబంధనలు పాటించకుండా చేపడుతున్న నిర్మాణాలు తెలంగాణ హక్కులకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఆర్డీఎస్ పరిధిలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేపడుతున్న వివిధ నిర్మాణాల కారణంగా తుంగభద్ర జలాలు తెలంగాణ వైపు ఆశించిన మేరకు చేరడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం మరింత తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతి నీటి చుక్కను సాధించేందుకు ప్రభుత్వం అన్ని రాజ్యాంగ, చట్టపరమైన మార్గాలను వినియోగించాలని సూచించారు.

పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ బృందం కృష్ణా, భీమా నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, బ్యారేజీలు, చెక్‌డ్యాంలను ప్రత్యక్షంగా పరిశీలించింది. స్థానిక పరిస్థితులు, నీటి ప్రవాహం, నిర్మాణాల ప్రభావం వంటి అంశాలపై వివరాలు సేకరించినట్లు నాయకులు తెలిపారు. ఈ పరిశీలన ఆధారంగా సమగ్ర నివేదికను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కృష్ణా, భీమా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని స్థాయిల్లో పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.



# నేపాల్‌లో భారత కరెన్సీకి ఊరట..
## రూ.25 వేల వరకు తీసుకెళ్లేందుకు అనుమతి

న్యూఢిల్లీ, జూలై 26, , తెలంగాణ ముచ్చట్లు:

భారత్-నేపాల్ మధ్య ప్రయాణించే పర్యాటకులు, వ్యాపారులు, ఉద్యోగులకు నేపాల్ కేంద్ర బ్యాంక్ (ఎన్ఆర్‌బీ) కీలక ఊరటనిచ్చింది. భారత కరెన్సీ వినియోగానికి సంబంధించిన నిబంధనలను సడలిస్తూ, ఇకపై ఇరు దేశాల పౌరులు తమ వెంట గరిష్ఠంగా రూ.25,000 వరకు భారత కరెన్సీని నేపాల్‌కు తీసుకెళ్లేందుకు లేదా అక్కడి నుంచి భారత్‌కు తీసుకురావడానికి అనుమతినిచ్చింది.

అయితే ఈ సడలింపు 2016 నవంబర్ 9 తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన రూ.200, రూ.500 నోట్లకే వర్తిస్తుందని స్పష్టం చేసింది. 2016లో రద్దైన పాత రూ.500, రూ.1,000 నోట్లపై నిషేధం యథాతథంగా కొనసాగుతుందని, వాటిని తీసుకెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

నేపాల్ పౌరులు భారతదేశం నుంచి మాత్రమే ఈ కరెన్సీని తీసుకెళ్లాలని, నేపాల్ నుంచి ఇతర దేశాలకు భారత కరెన్సీని తీసుకెళ్లేందుకు అనుమతి లేదని ఎన్ఆర్‌బీ తెలిపింది. అలాగే భారత్ మినహా ఇతర దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు 5,000 అమెరికన్ డాలర్లు లేదా సమాన విలువైన విదేశీ కరెన్సీ వరకు ఎలాంటి కస్టమ్స్ డిక్లరేషన్ లేకుండానే నేపాల్‌లోకి తీసుకురావచ్చని పేర్కొంది. ఆ పరిమితికి మించి ఉంటే కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని సూచించింది.

ఈ నిర్ణయం వల్ల భారత్-నేపాల్ మధ్య పర్యాటకం, సరిహద్దు వ్యాపారం, ఉద్యోగ, విద్యా అవసరాల కోసం ప్రయాణించే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుందని నేపాల్ కేంద్ర బ్యాంక్ అధికారులు తెలిపారు. రెండు దేశాల మధ్య నగదు లావాదేవీలు మరింత సులభతరం కావడంతో సరిహద్దు ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలకు కూడా ఊతం లభించనుంది.

# నిలకడగా పెద్ది ఆరోగ్యంపై..!

- తీవ్ర గుండెపోటుతో అస్వస్థత..
- సీపీఆర్‌తో గుండె స్పందన పునరుద్ధరణ..
- వెంటిలేటర్‌పై హైదరాబాద్‌కు తరలింపు
- హన్మకొండ టూ సికింద్రాబాద్ గ్రీన్ ఛానల్ ఏర్పాటు
- యశోదలో చికిత్స పొందుతున్న పెద్ది

వరంగల్,జులై26(తెలంగాణ ముచ్చట్లు):



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటుతో కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించి సీపీఆర్ ద్వారా గుండె స్పందనను పునరుద్ధరించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గ్రీన్ ఛానల్ ద్వారా వెంటిలేటర్ సాయంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

**గంటపాటు వైద్యుల పోరాటం**

రోహిణి ఆస్పత్రి వైద్యుల వివరాల ప్రకారం, ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి కార్డియాక్ అరెస్ట్ పరిస్థితి నెలకొంది. వెంటనే వైద్య బృందం దాదాపు గంటపాటు నిరంతరాయంగా సీపీఆర్ నిర్వహించి గుండె స్పందనను తిరిగి తీసుకువచ్చింది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళంలో గడ్డకట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు వైద్యులు వెల్లడించారు.

**ఆస్పత్రికి చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు**

సుదర్శన్ రెడ్డి అస్వస్థత విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రోహిణి ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంబులెన్స్ వెంట హైదరాబాద్‌కు బయలుదేరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**జనసంద్రంగా మారిన ఆస్పత్రి**

సుదర్శన్ రెడ్డి అస్వస్థత వార్త తెలియగానే నర్సంపేట నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు జనసంద్రంగా మారగా, ప్రతి ఒక్కరూ ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ కనిపించారు.

**భావోద్వేగానికి గురైన అభిమానులు**

సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం తెలుసుకున్న అభిమానులు ఆందోళనకు గురయ్యారు. కొందరు ఆస్పత్రి ఆవరణలోనే కన్నీటి పర్యంతమవగా, మరికొందరు ఆయన త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో ఆయన మరణించినట్లు వచ్చిన అసత్య ప్రచారాలను వైద్యులు ఖండించారు. చికిత్స కొనసాగుతోందని, ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉందని స్పష్టం చేశారు. దీంతో అభిమానులు కొంత ఊరట చెందినప్పటికీ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ యశోద ఆస్పత్రి వద్దకు కూడా పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు.






# కార్గిల్ వీరులకు నివాళి

- పరేడ్ గ్రౌండ్స్‌లో అమర జవాన్లకు ఘన వందనం
- కార్గిల్ విజయ్ దివస్ దేశ గర్వానికి ప్రతీక
- వీర జవాన్ల త్యాగం చిరస్మరణీయమని వ్యాఖ్య
- యువతకు దేశభక్తి స్ఫూర్తిగా నిలిచే గాథ

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వీరుల సైనిక స్మారక స్థూపం వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశం కోసం తమ జీవితాలను అర్పించిన అమరవీరుల త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ భారత సైన్యం అజేయ ధైర్యానికి, అసమాన పరాక్రమానికి, అచంచల సంకల్పానికి ప్రతీక అని రామచందర్ రావు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కార్గిల్ పర్వత శిఖరాలపై భారత సైనికులు అపూర్వ శౌర్యాన్ని ప్రదర్శించి దేశ గౌరవాన్ని కాపాడారని అన్నారు. వారి వీరోచిత పోరాటం భారత చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

కార్గిల్ యుద్ధంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ దేశ సమగ్రతను కాపాడిన సైనికుల ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. శత్రు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించిన వారి సేవలు ఎన్నటికీ మరువలేనివని తెలిపారు. అమర జవాన్ల కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు సైనికులు చేస్తున్న త్యాగం అపూర్వమని, వారి అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. సైన్యంపై ప్రతి భారతీయుడికి గౌరవం, కృతజ్ఞత ఉండాలని పిలుపునిచ్చారు.

అమర వీరుల త్యాగం యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని రామచందర్ రావు అన్నారు. దేశభక్తి, జాతీయ సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను యువత అలవర్చుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్గిల్ యోధుల వీరగాథలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాతృభూమి కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్లకు మరోసారి వినమ్ర నివాళులు అర్పిస్తున్నట్లు రామచందర్ రావు తెలిపారు. దేశ భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న భారత సైనికులందరికీ శిరసు వంచి వందనం చేస్తున్నామని, వారి త్యాగాలు భారతదేశానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

# వైద్యుల సేవలకు గౌరవం

- తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుక
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కొండా సురేఖ
- విశిష్ట సేవలు అందించిన వైద్యులకు సత్కారం
- ఆరోగ్య రంగానికి వైద్యుల సేవలు అమూల్యమని వ్యాఖ్య

హైదరాబాద్, జూలై 26 (తెలంగాణ ముచ్చట్లు):






హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఉన్న 'ది పార్క్' హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య రంగంలో విశేష సేవలు అందించిన పలువురు వైద్యులకు ఈ సందర్భంగా అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. రాష్ట్ర ఆరోగ్య రంగ అభివృద్ధిలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న వైద్యులను అభినందించిన కొండా సురేఖ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వారు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని, వారి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మానవత్వంతో కూడిన వైద్య సేవలను అందించడం ప్రతి వైద్యుడి బాధ్యత అని మంత్రి అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తున్న వైద్యుల కృషి అమూల్యమని, వారికి సమాజంలో మరింత గౌరవం దక్కాల్సిన అవసరం ఉందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల విస్తరణ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, వైద్య సిబ్బంది బలోపేతం వంటి చర్యలతో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ వంటి కార్యక్రమాలు వైద్యులను మరింత ఉత్తేజపరుస్తాయని, సేవా భావంతో పనిచేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా యువ వైద్యులకు కూడా ప్రేరణ లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలను అందిస్తున్న వారిని ప్రోత్సహించడం సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు, ఆరోగ్య రంగ నిపుణులు, ఆహ్వానితులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in